తెలుగు దినపత్రిక

RNI/PRGI : TGTEL/26/A2468

త్రినేత్ర

ట్రూత్‌లైన్

నిజం నిక్కచ్చిగా.. నిరంతరం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణా - ఆంధ్ర ప్రదేశ్

రెండు తెలుగు రాష్ట్రాల్లో -
త్రినేత్ర ట్రూత్‌లైన్ తెలుగు దిన పత్రికలో

జిల్లా బ్యూరో, జిల్లా స్టాఫ్- డివిజన్ అసెంబ్లీ ఇంఛార్జీలు
మండల రిపోర్టర్ కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబరు

94419 29000

సంపుటి : 01 సంచిక : 206 ఎడిటర్ : పెరిక అభిలాష్ సోమవారం 16-11-2026 పేజీలు : 4 వెల: రూ.2

www.youtube.com/@Thrinethra Truthlinenews | thrinethratruthline_news | Thrinethra Truthline News | www.epaperthrinethratruthline.co.in/

ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

కీలక అంశాలపై చర్చ



ఢిల్లీ, (త్రినేత్ర ట్రూత్‌లైన్) ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. సీఎంతో పాటు ప్రధానిని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కలిశారు. డిసెంబరు 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే గ్లోబల్ సమ్మిట్, అలాగే, డిసెంబరులో జరిగే ఖేలో ఇండియా క్రీడల ప్రారంభానికి ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆహ్వానించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలతో పాటు ఎల్‌నినో ప్రభావంపై ప్రధాని నరేంద్రమోదీతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో లోటు వర్షపాతం, కరువు పరిస్థితులను ప్రధానికి వివరించి కేంద్ర సహాయాన్ని సీఎం అడిగినట్లు సమాచారం. 365 మండలాలను కరువు మండలాలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రూ.30వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు తెలుస్తోంది. అలాగే,152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతులు ఇప్పించాలని సీఎం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. గోదావరి – కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని, ఈ ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో 50 శాతం వాటాను తెలంగాణకు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి బృందం విన్నవించినట్లు తెలుస్తోంది. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి అడిగినట్లు సమాచారం. సోమవారం కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

అనుమతుల విషయంలో చొరవ చూపాలని ప్రధానిని కోరాం: ఉత్తమ్



దిల్లీ: (త్రినేత్ర ట్రూత్‌లైన్)పర్యావరణ అనుమతుల విషయంలో చొరవ చూపాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. "ఇరిగేషన్ విషయాలకు సంబంధించి ప్రధాని మోదీతో చర్చించాం. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని సహకారం కోరాం. పర్యావరణ అనుమతుల విషయంలో ఎదురైన ఇబ్బందులపై చర్చించాం. పర్యావరణ అనుమతులు లేకపోవడం వల్ల ప్రాజెక్టుల పనులు ఆగిపోయాయి. అనుమతుల కోసం పర్యావరణ మంత్రిత్వశాఖ జాప్యం చేస్తోందని వివరించాం. తుమ్మిడిహెట్టి– ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రధానికి వివరించాం. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒప్పించాలని ప్రధానిని కోరాం. సమ్మక్క–సారక్క బ్యారేజీపై ప్రధాని మోదీతో చర్చించి, అనుమతులపై వేగం పెంచేలా చూడాని విజ్ఞప్తి చేశాం. పరిహారం ఎంతైనా చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఇప్పటికే తెలిపాం" అని ఉత్తమ్ వివరించారు.

హరీశ్ రావు నివాసానికి కేసీఆర్

హైదరాబాద్, (త్రినేత్ర ట్రూత్‌లైన్):బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు నివాసానికి వెళ్లారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కేటీఆర్ సైతం హాజరయ్యారు. కేటీఆర్ ఆయన కుమారుడు హిమాన్షుతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

మావోయిస్టుల హింసకు ఆదివాసీలు బలి

- గిరిజనుల ఓటు హక్కును కాలరాసినా పట్టించుకోని గత పాలకులు
- గిరిజనాభివృద్ధికి లక్ష కోట్లకు పైగా నిధులు
- బిర్సా ముండా జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ



మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీ సమాజం తీవ్రంగా నష్టపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా మావోయిస్టుల హింస, బెదిరింపుల మధ్య గిరిజనులు జీవించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నక్సలైట్లు గిరిజనుల ప్రాథమిక హక్కులను కాలరాయడంతోపాటు వారి ఓటు హక్కును సైతం హరించారని విమర్శించారు. అయినప్పటికీ గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో నాటి పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ ఉద్యమ నాయకుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా గిరిజనుల అభ్యున్నతి, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఢిల్లీ, (త్రినేత్ర ట్రూత్‌లైన్)

గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దేశంలోని అనేక గిరిజన ప్రాంతాలు కనీస మౌలిక వసతులకు నోచుకోలేదని మోదీ పేర్కొన్నారు. రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేక గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.గత పాలకులు ఆయా ప్రాంతాల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో గిరిజన ప్రాంతాలు వెనుకబడిపోయాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని వెల్లడించారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు ప్రభుత్వ పథకాలు అందించడమే తమ ప్రాధాన్యమని పేర్కొన్నారు.

రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు

గడ్చిరోలి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.3 వేల కోట్ల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ ప్రాజెక్టులు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలను ప్రధాన ప్రవంతిలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందన్నారు.అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల ద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

పేదరిక నిర్మూలనలో కీలక విజయం

దేశంలో సుమారు 50 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడం స్వాతంత్ర్యం అనంతరం భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని మోదీ పేర్కొన్నారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రత, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.బిర్సా ముండా చూపిన పోరాట స్ఫూర్తి, ఆదివాసీ సమాజ హక్కుల కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని మోదీ పేర్కొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మావోయిస్టు హింస నుంచి గిరిజనులకు విముక్తి కల్పించడంతోపాటు వారికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రధాని వెల్లడించారు.

గురువు కాళ్లు గుంజేవాళ్లం కాదు..

బీఆర్ఎస్‌కు బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్



హైదరాబాద్, (త్రినేత్ర ట్రూత్‌లైన్) బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాధనాన్ని దోచుకోవడం, భార్యాభర్తల వ్యక్తిగత సంభాషణలను కూడా వినడమేనా 'డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్' అని ఆయన బీఆర్ఎస్‌ను నిలదీశారు. తెలంగాణ ప్రజలకు 'డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్' ఏమిటో బాగా తెలుసని, అందుకే గత ఎన్నికల్లో ఆ పార్టీని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు**'డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్' అంటే ఇదేనా..?**రాష్ట్రంలో గత బీఆర్ఎస్ పాలనను ఉద్దేశించి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇంటర్ విద్యార్థులు, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం, సర్పంచులు, కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు ఇవ్వకుండా వారిని చావుబాట పట్టించడం, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేయడమేనా డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్ అని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి దోచుకోవడానికే అధికారాన్ని వాడారని బండి సంజయ్ విమర్శించారు.**కాళ్లు మొక్కడంపై కౌంటర్..** తాను తన గురువుల కాళ్లు మొక్కడంపై వస్తున్న విమర్శలకు బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను బరాబర్ మా గురువుల కాళ్లు మొక్కుతా.. మీ లెక్క చెప్పులు ఎత్తుకుపోయే వాడిని కాదు.. గురువు కాళ్లను గుంజేవాళ్లం కాదు, మీ లెక్క మంది కొంపలు ముంచే విలువలు మాకు మా గురువులు నేర్పలేదు' అని స్పష్టం చేశారు. సంస్కారం, విలువలతో కూడిన రాజకీయాలు తమవి అని ఆయన తేల్చిచెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసే అవకాశం లేదు: మంత్రి తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం(త్రినేత్ర ట్రూత్‌లైన్)కాళేశ్వరం ప్రాజెక్టులో గేట్లు మూసి నీటిని నిల్వ చేసే అవకాశం లేదని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద మాత్రమే నీటి నిల్వకు అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదా వరి నీటి నిల్వ పనులను మంత్రి పరిశీలించారు. అలాగే, దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో పర్యటించారు. తన జన్మదినం సందర్భంగా పూసు కుంట గిరిజనులతో సమావేశమయ్యారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకొని అర్హులైన గిరిజనులకు పెన్షన్లు, రేషన్ కార్డులు, జాబ్ కార్డులు, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.ల్లో తాగునీటికి ఎద్దడి లేకుండా నీటిని నిల్వ చేస్తున్నామని వెల్లడించారు. గతంలో మాదిరిగా గోదావరిలో నీటి ప్రవాహం లేదని చెప్పుకొచ్చారు. తాగునీటి గండం లేకుండా నీటిని నిల్వ చేస్తున్నామని వివరించారు.

భువనగిరిలో 'మై పైసా' ఆన్‌లైన్ చిట్‌ఫండ్స్ ప్రారంభం

ప్రారంభోత్సవానికి హాజరైన రోటరీ ప్రముఖులు..
మాజీ అధ్యక్షుడు గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ

(త్రినేత్ర ట్రూత్‌లైన్)యాదాద్రి భువనగిరి జిల్లా । నవంబర్ 15, 2026భువనగిరి: పట్టణంలో 'మై పైసా' ఆన్‌లైన్ చిట్‌ఫండ్స్ సంస్థను ఘనంగా ప్రారంభించారు. రోటరీ సీనియర్ సభ్యుడు శ్రీ బలుసుగూరి యాదగిరి మార్గదర్శకత్వంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు శ్రీ ఎం.ఏ. రహీం ముఖ్య అతిథిగా హాజరై సంస్థను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి మాజీ అధ్యక్షుడు గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి ప్రముఖంగా పాల్గొన్నారు. పట్టణంలో జరుగుతున్న సామాజిక, వ్యాపార కార్యక్రమాల్లో రోటరీ సభ్యుల భాగస్వామ్యాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.అలాగే రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీ పాకిరి కొండల్ రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి అధ్యక్షుడు శ్రీ కుచిపట్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీ ఎం.డి. హనీఫ్ మెమన్, కార్యదర్శి శ్రీ బద్దం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.శ్రీ చిదరకంటి సిద్ధి రాములు, శ్రీ గుమ్ముల మల్లేశం, శ్రీ గూడూరు అశోక్ రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభమైన 'మై పైసా' సంస్థ వినియోగదారులకు నమ్మకమైన సేవలు అందిస్తూ, భువనగిరి పట్టణ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పాల్గొన్న రోటరీ ప్రముఖులు ఆకాంక్షించారు.ఫోటో క్యాప్షన్: భువనగిరి పట్టణంలో 'మై పైసా' ఆన్‌లైన్ చిట్‌ఫండ్స్ ప్రారంభోత్సవ



కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ ప్రముఖులు, సంస్థ ప్రతినిధులు.


ఆశ్రమ పాట శాలలో ముండా 151 జయంతి ఉత్సవాలు.

జన్నారం నవంబర్ 15(త్రినేత్ర ట్రూత్‌లైన్)గిరిజన స్వతంత్ర సమరయోధుడు బీర్సా ముండా 151 జయంతి వేడుకలను మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ ఆదేశానుసారం ఈ జయంతినీ నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజం తెలిపారు.వారు మాట్లాడుతూ గిరిజన స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం వారి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా నవంబరు 1 నుండి 15 వరకు దేశ వ్యాప్తంగా జనజాతీయ పక్వడా పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశం.బీర్సా కిషనరావు.సంధ్యారాణి.గిరిజన పెద్దలు పిల్లలు పాల్గొన్నారు.



గ్రంథాలయలు విజ్ఞాన కేంద్రాలు.ధర్మపురి వెంకటేశ్వర్లు.

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్) గ్రంథాలయలు విజ్ఞాన కేంద్రాలని ప్రముఖ కవి ఉపాధ్యాయులు ధర్మపురి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనం లో పాల్గొని ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు పుస్తక పఠనం చేయాలనీ. పుస్తకలు చదవడం వలన కలిగే విజ్ఞానం గురించి, పలు విషయాల గురించి, వివరించారు.ఈ కార్యకార్యక్రమంలో కవులు దేవరాజు రేవతి, గుర్రాల వెంకటేశ్వర్లు, నల్లగొండ రమేష్,చిలుకూరి రాధాకృష్ణ చారి, రాజన్న,లు చదివిన కవితలు అహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం లైబ్రరిన్ లు. ప్రవీణ్ సదానందం పృద్వీరాజ్, శారద, తదితరులు పాల్గొన్నారు.



బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన వీరుడు

బీర్సా ముంజ 151వ జయంతి.అశోక్ మహోల్కర్.



ఆసిఫాబాద్ జిల్లా (వాంకిడి) ప్రతినిధి నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్)18వ శతాబ్దం చివరి, 19వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన స్వాతంత్ర సంగ్రామంలో చురుకుగా పాల్గొన్న బీర్సా ముంజ బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన వీరుడని ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహోల్కర్, సమతా సైనిక దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్,లు అన్నారు. ఆదివారం నాగపూర్ నుండి ఈ కార్యక్రమానికి హాజరైన బౌద్ధ మత గురువు భరద్వాజ్ భంతే ఆధ్వర్యంలో భగవాన్ బీర్సా ముంజ151వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిర్సా ముంజ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జార్ఖండ్ లోని సాల్గాం లో తన గురువు జైపాల్ నాగ్ మార్గదర్శకంలో విద్యను పొందాడని, తర్వాత బీర్సా జర్మన్ మిషన్ స్కూల్లో చేయడానికి క్రైస్తవ మతంలోకి మారాడని అన్నారు. బీర్సా ముండా బీర్సా ఇత్ అనే మతాన్ని తానే సృష్టించాడని, ముండా సముదాయ సభ్యులు త్వరలోనే ఈ మతంలోకి చేయడం ప్రారంభించడంతో ఇది బ్రిటిష్ కార్యకలాపాలకు సవాలుగా మాడంతో నిజమైన శత్రువులు బ్రిటిష్, క్రైస్తవ మిషనరీలు అని బహిరంగంగా బీర్ షా ముండా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా ఇన్చార్జి విజయ్, ఉప్రేపే అంబేద్కర్ సంఘం సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు విలాస్, దుర్గాజి, దుర్గం శ్యామ్ రావు, రాజేశ్వర్, రమేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా స్ఫూర్తిగా వికసిత్ భారత్ నిర్మాణం.

జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్): భగవాన్ బిర్సా ముండా జీవితం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని వికసిత్ భారత్ నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు.ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన జనజాతీయ గౌరవ దివస్ వేడుకలలో భాగంగా నిర్వహించిన గౌరవ దివస్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా సందేశం అందించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా జయంతిని జనజాతీయ గౌరవ దివస్‌గా నిర్వహించడం ద్వారా ఆదివాసీల ఆత్మగౌరవానికి సముచిత గుర్తింపు కల్పించామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, గిరిజనుల హక్కుల పరిరక్షణలో బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని, గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని వివరించారు. అనంతరం పలువురు ఆదివాసీలతో మాట్లాడి, వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, ఆదివాసీ సంఘాల ప్రప్రతినిధులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, గిరిజనుల హక్కుల సాధనలో భగవాన్ బిర్సా ముండా విశేష కృషి చేశారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'ఉల్గులాన్' పేరుతో సాయుధ పోరాటం చేపట్టి గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించారని తెలిపారు.విద్యార్థి దశ నుండి బిర్సా ముండా వంటి మహనీయుల జీవిత చరిత్రలు, వారి పోరాటాలు, త్యాగాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దేశ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి.

రీజినల్ కోఆర్డినేటర్ శ్రీధర్.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్) విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బీసీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ శ్రీధర్ సూచించారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన ఇటీవల జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.


నాగారం పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.. సబ్‌స్టేషన్ల నిర్వహణ పనులే కారణం

నాగారం(త్రినేత్ర ట్రూత్‌లైన్)నాగారం సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో సోమవారం (నవంబర్ 16) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎ+ఈఈ నాగారం సెక్షన్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీకే అహ్మద్‌గూడ, చక్రీపురం సబ్‌స్టేషన్లలో చేపట్టనున్న నిర్వహణ పనులు మరియు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేర్వేరు సమయాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు (ఆర్జీకే అహ్మద్‌గూడ సబ్‌స్టేషన్ పరిధి): 11 కేవీ భారతరత్న ఫీడర్: ఈడెన్ గార్డెన్, ఆర్జీకే వై జంక్షన్, ఎన్జీఆర్ కాలనీ, వీఆర్ఆర్ ఫేజ్ 1 & 2, ఇందిరమ్మ కాలనీ, కేఎల్ఆర్ వాటర్ ప్లాంట్ వెనుక ప్రాంతం, వీఆర్ఆర్ హోమ్స్, పద్మజ ఎన్క్లేవ్, సెయింట్ ఆండ్రూ స్కూల్, లక్ష్మీ గణపతి కాలనీ, సాయి శ్రీనివాస్ కాలనీ, బాలాజీ నగర్, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. 11 కేవీ ఆర్జీకే అహ్మద్‌గూడ ఫీడర్: ఆర్జీకే, హరిదాస్‌పల్లి, సింధు వనం కాలనీ, గురుకుల్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిచి పోనుంది.మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు (చక్రీపురం సబ్‌స్టేషన్ పరిధి): ఎస్వీ నగర్ ఫీడర్: ఉషోదయ కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీ, ఎస్వీ నగర్, పీఎంఆర్ ఎన్క్లేవ్, ఎస్ఎంహెచ్ ప్లాజా, వెంకటాద్రి కాలనీ, మామిళ్ల నారాయణ కాలనీ, వీఎస్ఎన్ గార్డెన్స్, బ్రహ్మయ్య కాలనీ, ఈశ్వరపురి కాలనీ, సాయి నివాస్ నగర్, జీపీ కాలనీ, సాయి తులసి కాలనీలు. సింహపురి కాలనీ ఫీడర్: లక్ష్మీనగర్, సింహపురి కాలనీ, పాత గ్రామం, వికాస్ నగర్, వెంకటేశ్వర నగర్ కాలనీ, మధుర నగర్, దుర్గయ్య నగర్, దత్తాత్రేయ కాలనీ, తారాపురి కాలనీ. బాయి రెడ్డి నగర్ ఫీడర్: శిల్పా నగర్, మోడీ అపార్ట్‌మెంట్స్, లావణ్య ఎన్క్లేవ్, ప్రగతి ఎన్క్లేవ్, చక్రధర ఎన్క్లేవ్, బాయి రెడ్డి కాలనీ, లోటస్ కాలనీ, వికాస్ నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాలు. శిల్పా నగర్ ఫీడర్: సత్యనారాయణ కాలనీ రోడ్డు నంబర్ 1 నుండి 12 వరకు, శివ సాయి ఎన్క్లేవ్, లోటస్ కాలనీ, అన్నమయ్య కాలనీ, ఐడీ ఎన్క్లేవ్, ఓం సాయి నగర్, కేబీఆర్ కాలనీ, శిల్పా నగర్, పాత మోడీ, మల్లికార్జున నగర్, వెంకట్ రెడ్డి కాలనీ, సాయి దుర్గ నగర్, భాగ్య నగర్, శ్రీనివాస నగర్ కాలనీలు. విజయపురి కాలనీ ఫీడర్: విజయపురి కాలనీ, బాలాజీ నగర్, ఎస్వీ నగర్, మామిళ్ల నారాయణ కాలనీ ప్రాంతాలు. దమ్మాయిగూడ–2/అయ్యప్ప ఫీడర్: భవానీ నగర్, నాగారం నుంచి దమ్మాయిగూడ ప్రధాన రహదారి, శశాంక్ ఎన్క్లేవ్, బాలాజీ నగర్, లక్ష్మీనగర్, గాయత్రి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.వి

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం..
పట్టించుకోని అధికారులు!



జవహర్ నగర్(త్రినేత్ర ట్రూత్‌లైన్):జవహర్ నగర్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ – అరుంధతి నగర్ మెయిన్ రోడ్డులో పూర్తిగా ఒరిగిపోయిన ఓ విద్యుత్ స్తంభం స్థానికులకు, వాహనదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితిలో ఉన్న ఈ స్తంభంతో పెను ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని రోజుల క్రితం ఈ రహదారిపై రోడ్డు పనులు నిర్వహిస్తున్న సమయంలో ఓ డోజర్ ఢీకొనడంతో ఈ విద్యుత్ స్తంభం తీవ్రంగా దెబ్బతిని ఒకవైపునకు ఒరిగిపోయింది. అప్పటి నుండి స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఇదే రహదారి గుండా నిత్యం వందలాది మంది పాఠశాల విద్యార్థులు, చిన్నారులు రాకపోకలు సాగిస్తుండటంతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు.



బీఆర్ఎస్ యూత్ నాయకుడి హెచ్చరిక:ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కె. విక్రమ్, అరుంధతి నగర్ వాసులతో కలిసి స్పందించారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఒరిగిపోయిన పాత స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏదైనా పెను ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే దానికి సంబంధిత శాఖే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

30 ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా? చంద్రబాబు నగర్‌కు సీసీ రోడ్డు నిర్మించండి

జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్‌కు కాలనీవాసుల వినతి
సమస్య పరిష్కారానికి సానుకూల స్పందన, త్వరలోనే పనుల ప్రారంభానికి హామీ

జవహర్ నగర్ (త్రినేత్ర ట్రూత్‌లైన్)జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని చంద్రబాబు నగర్, అంబేద్కర్ నగర్ కాలనీలలో మూడు దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చంద్రబాబు నగర్ కాలనీ అధ్యక్షుడు బూరుగు కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో స్థానికులు జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ప్రమాదాలకు నిలయంగా మట్టి రోడ్లుఈ సందర్భంగా కాలనీవాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ.. తాము గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నప్పటికీ, నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని వాపోయారు. కాలనీలో మట్టి రోడ్డు ఉండటం వల్ల నిత్యం రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వాహనదారులు, పాదచారులు వలుమార్లు జారివడి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.శాశ్వత పరిష్కారం చూపాలిహైటెన్షన్ లైన్ ముత్యాలమ్మ గుడి నుంచి ఏకలవ్య స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తే ఇరు కాలనీల ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుందని, 30 ఏళ్ల నమన్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వారు విజ్ఞప్తి చేశారు.శాంతి కోటేష్ గౌడ్ సానుకూల హామీకాలనీవాసుల సమస్యలను ఓపికగా విన్న శాంతి కోటేష్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. సీసీ రోడ్డు నిర్మాణ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన సానుకూల స్పందన పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్ల వినయ్ కుమార్, అబ్బాగోని రాజు, పొలాస కిరణ్, కిట్టు, శ్రీనులతో పాటు కాలనీవాసులు నర్సింలు, సత్యనారాయణ, పూర్ణచందర్, కృష్ణారెడ్డి, రాజేష్, స్వామి, నవీన్ యాదవ్, విజయ, పద్మ, రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా గిరిజన కాలనీలో న్యాయ అవగాహన సదస్సు

(త్రినేత్ర ట్రూత్‌లైన్)ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి (జన జాతీయ గౌరవ దివస్) సందర్భంగా బాపట్ల పట్టణం కొండుబోట్లవారి పాలెం గిరిజన కాలనీలో జన్మదిన వేడుకలు మరియు న్యాయ అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్, విలేజ్ వెల్నెస్ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పారా లీగల్ వాలంటీర్ గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... చరిత్రలోనే అత్యంత గొప్ప వీరుడు, గిరిజనుల అభ్యున్నతికి మరియు భారత అభివృద్ధికి బాటలు వేసిన మహానుభావుడు బిర్సా ముండా అని కొనియాడారు. గిరిజన కుటుంబాలు కక్షలు, కార్పన్యాలకు పోకుండా సోదరభావంతో కలిసికట్టుగా మెలగాలని సూచించారు. వారికి ఎలాంటి న్యాయపరమైన అవసరాలు ఉన్నా బాపట్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.అనంతరం విలేజ్ వెల్నెస్ ప్రతినిధి గోపురాజు రామకృష్ణ సుబ్బారావు మాట్లాడుతూ... జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా గిరిజనులకు న్యాయస్థానాల ద్వారా లభించే ఉచిత సేవలు, మండల న్యాయ సేవా సంస్థ పనితీరుపై అవగాహన కల్పించేందుకే ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపార్టు సంస్థ డైరెక్టర్ కె. రవి ప్రదీప్, ఏ. బాలాజీ రెడ్డి, కె. కిషోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.





పోరుమామిళ్లలో ఫుట్‌పాత్ ఆక్రమణ..

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం!

ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో యథేచ్ఛగా నిర్మాణ పనులు --
ప్రశ్నించిన విలేకరులపై దురుసు ప్రవర్తన





పోరుమామిళ్ల (కడప జిల్లా), నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్)పోరుమామిళ్ల పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ప్రజలు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అక్రమంగా నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం రోగులు, వృద్ధులు, పాదచారులు రాకపోకలు సాగించే ప్రాంతంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో డ్రైనేజీ నిర్మాణానికి అభ్యంతరం.. ఇప్పుడు ప్రభుత్వ స్థలంలో నిర్మాణమా?గతంలో మురుగునీటి కాలువ నిర్మాణం కోసం స్థలం అవసరమైన సమయంలో సదరు వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా, ఆ స్థలం తనదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వ స్థలంగా భావిస్తున్న ఫుట్‌పాత్‌పై నిర్మాణ పనులు ఎలా చేపడుతున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు ప్రజా అవసరాల కోసం స్థలం ఇవ్వడానికి అభ్యంతరం వ్యక్తం చేసి, మరోవైపు ప్రజలు ఉపయోగించాల్సిన ఫుట్‌పాత్‌ను ఆక్రమించడం ఏమిటని పట్టణవాసులు నిలదీస్తున్నారు.ప్రశ్నించిన విలేకరులపై దురుసు ప్రవర్తనప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులపై సమాచారం తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లిన స్థానిక విలేకరులు, ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి విలేకరులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు, వారి ఫొటోలు, వీడియోలు తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరిస్తూ బెదిరించే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుల పట్ల ఇలాంటి వైఖరి తగదని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఫుట్‌పాత్ ఆక్రమణతో పాదచారులకు ఇబ్బందులుప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు, గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఫుట్‌పాత్‌పై నిర్మాణాలు చేపట్టడం వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.అధికారుల స్పందన ఏదీ?ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో బహిరంగంగా నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత అధికారులదేనని, ఆక్రమణలపై నిర్లక్ష్యం వహిస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని అంటున్నారు.ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత స్థలాన్ని పరిశీలించాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిర్మాణం జరుగుతున్న ప్రాంతం ప్రభుత్వ స్థలమా, ఫుట్‌పాత్ పరిధిలోకి వస్తుందా అనే అంశాలపై అధికారికంగా సర్వే నిర్వహించి, ఆక్రమణ ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విలేకరులపై దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపైనా విచారణ జరిపించాలని కోరుతున్నారు.ప్రజల నడకకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పోరుమామిళ్ల పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

59వ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖ గ్రంథాలయం నందు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎం యు ఓ ఎల్.బాలు ప్రారంభించారు.

మైలవరం నవంబర్ 15.(త్రినేత్ర ట్రూత్‌లైన్) పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.“చదవడం నేర్చుకోవడానికి, నేర్చుకోవడం నాయకత్వం వహించడానికి’ పూర్వం మన పూర్వీకులు గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించేవారు. వివేకానందుడు,అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహానుభావులందరూ గొప్ప పుస్తక ప్రియులే, వారు చదివారు కాబట్టి నేర్చుకున్నారు. నేర్చుకున్నారు కాబట్టి ప్రపంచానికి నాయకులయ్యారు అని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు విద్యార్థినీ,విద్యార్థులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పులివీడు పంచాయతీ సర్పంచ్ బరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు మహిళలు నామినేషన్



పోరుమామిళ్ల, నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్) మండలంలోని పులివీడు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ముగ్గురు మహిళలు ఈరోజు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల అనంతరం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డిని ఆయన నివానంలో కలిని మాట్లాడారు. ఈ సందర్భంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాగార్జున రెడ్డి నూచించారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి, రంగారెడ్డి, పోలిరెడ్డి, బాబు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో ఆదిత్య రెడ్డి గారు అడుగులు.. షేక్ అర్షియా గెలుపే లక్ష్యంగా

పోరుమామిళ్ల నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్):పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి షేక్ అర్షియా గారి విజయమే లక్ష్యంగా నియోజకవర్గ ఎన్నికల రథసారథి, యువ నాయకుడు దేవసాని ఆదిత్య రెడ్డి గారి సారథ్యంలో రెండో రోజు ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మాయాబజార్ వీధి, ఉద్దికట్ట వీధుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు వేసి షేక్ అర్షియా గారిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆదిత్య రెడ్డి గారు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్లలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. మరోసారి షేక్ అర్షియా గారిని సర్పంచ్‌గా గెలిపిస్తే పోరుమామిళ్లలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలను పరిష్కరించి, మున్సిపాలిటీ స్థాయిలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పోరుమామిళ్లను మరింత అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజల ఆశీస్సులు, పార్టీ శ్రేణుల ఐక్యతతో పోరుమామిళ్ల అభివృద్ధికి నూతన బాటలు వేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సీఎం భాష రాష్ట్ర మరియు జిల్లా మరియు మండల అనుబంధ విభాగాల నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,రాజీవ్ భాష, రాళ్లపల్లి నరసింహులు, తులసి సురేష్,ఇషాక్, షేక్ మస్తాన్ ,హుస్సేన్ పీరా, సుబ్బారావు, రామయ్య, మహబూబ్ బాషా, రామయ్య, బ్రహ్మయ్య,సద్దాం, దాదాభాష, చాపాటి సాయి నారాయణ రెడ్డి,పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రంగసముద్రం సర్పంచ్ అభ్యర్థిగా దియ్యాల మంజుల నామినేషన్ దాఖలు

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి..
ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడి



పోరుమామిళ్ల నవంబర్ 15 (త్రినేత్ర ట్రూత్‌లైన్))కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దియ్యాల మంజుల నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకొని సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన ఆమె, గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా దియ్యాల మంజుల మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడటం, అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.అదేవిధంగా గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు.సర్పంచ్ పదవి అంటే కేవలం హోదా మాత్రమే కాదని, అది గ్రామ ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యత అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.రంగసముద్రం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే తన సంకల్పమని దియ్యాల మంజుల స్పష్టం చేశారు. గ్రామ ప్రజల ఆదరాభిమానాలతో సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.


చిత్రసీమ

స్టైలిష్ లుక్‌లో సుష్మిత సందడి

'దొంగ నా కొడుకు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో

హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో జరిగిన 'దొంగ నా కొడుకు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అందాల భామ సుష్మిత శెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకకు హాజరైన ఆమె తన అందం, హుందాతనం, స్టైలిష్ లుక్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా సుష్మిత శెట్టి లుక్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఎంతో అందంగా ముస్తాబై, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తూ కెమెరాలకు ఫోజులిచ్చారు. ఆమె చిరునవ్వు, ఆకర్షణీయమైన వస్త్రధారణ, గ్రేస్‌ఫుల్ లుక్స్ ఫొటోలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. 'దొంగ నా కొడుకు' ప్రీ రిలీజ్ వేడుకలో సుష్మిత శెట్టి సందడి నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.






చిరునవ్వుతో సుపర్ణ నాయర్..

అందంతో కట్టిపడేస్తున్న ముద్దుగుమ్మ!

తన అందం, అభినయం, ఆకర్షణీయమైన చిరునవ్వుతో అభిమానులను అలరిస్తోంది నటి సుపర్ణ నాయర్. తాజాగా తన అందమైన ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. రేడియంట్ లుక్‌తో మెరిసిపోతూ, ఎంతో హుందాగా కనిపిస్తున్న సుపర్ణ నాయర్ తన ప్రత్యేకమైన స్టైల్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖంపై చెరగని చిరునవ్వు, సహజమైన అందం, ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించే తీరు ఆమె ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సింపుల్ లుక్‌లోనూ తన అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ ముద్దుగుమ్మ ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందం, ఆత్మవిశ్వాసం కలగలిసిన ఆమె రూపం అభిమానులను కట్టిపడేస్తోంది. దీంతో సుపర్ణ నాయర్ తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

పింక్ అండ్ వైట్ స్ట్రైప్స్‌లో మహిమ మక్వానా

సమ్మర్ లుక్‌తో మెస్మరైజ్!




అందం, అభినయంతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మహిమ మక్వానా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. తాజాగా పింక్ అండ్ వైట్ స్ట్రైప్స్ డ్రెస్‌లో కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సమ్మర్ వైబ్స్‌ను ప్రతిబింబించేలా ఎంతో ఫ్రెష్‌గా కనిపిస్తున్న మహిమ.. తన అందమైన చిరునవ్వుతో ఫొటోలకు మరింత ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చింది. సింపుల్ అవుట్‌ఫిట్‌లోనూ ఎంతో స్టైలిష్‌గా, హుందాగా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఎలాంటి ఆర్భాటం లేకుండా సహజమైన అందం, ఆత్మవిశ్వాసంతో మెరిసిపోవడం మహిమ ప్రత్యేకతగా నిలుస్తోంది. పింక్ అండ్ వైట్ కాంబినేషన్‌కు తన గ్రేస్‌ఫుల్ లుక్‌ను జోడించి అభిమానులను ఫిదా చేస్తోంది. ప్రస్తుతం ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి.

స్మైలీ లుక్‌లో వాణి భోజన్..

అందం, హుందాతనంతో మెస్మరైజ్



తన అందం, ఆకర్షణీయమైన చిరునవ్వు, హుందాతనంతో అభిమానులను ఆకట్టుకుంటోంది నటి వాణి భోజన్. ఎప్పటికప్పుడు తన స్టైలిష్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేసే ఈ ముద్దుగుమ్మ తాజాగా మరోసారి తన అందంతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. తాజా ఫొటోల్లో వాణి భోజన్ ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ముఖంపై చెరగని చిరునవ్వు, సహజమైన అందం, ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించే తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతి ఫొటోలోనూ తనదైన స్టైల్, ఆత్మవిశ్వాసంతో మెరిసిపోతోంది. సింపుల్ లుక్‌లోనూ ప్రత్యేకంగా కనిపించడం వాణి భోజన్ స్టైల్‌లోని మరో విశేషం. అందం, హుందాతనం కలగలిసిన ఆమె ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో వాణి భోజన్ తాజా ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.



సాయి పల్లవి ఇంట్లోనూ సింప్లిసిటీ

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సినిమాల ఎంపికలో ఎంత జాగ్రత్తగా ఉంటారో, వ్యక్తిగత జీవితంలోనూ అంతే నిరాడంబరంగా ఉంటారు. బలమైన పాత్రలకు మాత్రమే ప్రాధాన్యమిస్తూ, పారితోషికం కోసం సినిమాలకు అంగీకరించరు. స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆర్భాటాలకు దూరంగా సాధారణ జీవితాన్ని ఇష్టపడతారు. కోయంబత్తూరులో సుమారు రూ.8 కోట్ల విలువైన ఇంటిని సంప్రదాయ దక్షిణ భారతీయ శైలిలో నిర్మించుకున్నట్లు సమాచారం. విలాసవంతమైన ఇంటీరియర్స్, ఆధునిక హంగులకు బదులుగా ప్రశాంతతకు ప్రాధాన్యమిచ్చారు. సంప్రదాయ చెక్క ఫర్నిచర్, కుటుంబ ఫొటోలు, పచ్చని మొక్కలు, ప్రత్యేక పూజా గదితో ఇంటిని తీర్చిదిద్దారు. విశాలమైన లివింగ్ రూమ్‌ను కుటుంబ సభ్యులంతా కలిసి సమయం గడిపేలా రూపొందించారు. బయటకు వెళ్లినప్పుడు సెలబ్రిటీ హోదాను పక్కనపెట్టి సాధారణ వ్యక్తిలా తిరగడం, థియేటర్లలో ప్రేక్షకులతో కలిసి సినిమాలు చూడటం సాయి పల్లవి ప్రత్యేకత. సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ ఆమె నిరాడంబరత నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

బ్లాక్ శారీలో మమిత బైజు..

బ్యూటీ, స్టైల్‌తో కట్టిపడేస్తున్న ముద్దుగుమ్మ

మలయాళ బ్యూటీ మమితా బైజు తన అందం, అభినయంతోనే కాకుండా ఫ్యాషన్ లుక్స్‌తోనూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా బ్లాక్ శారీలో దర్శనమిస్తూ తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. నలుపు రంగు శారీలో ఎంతో హుందాగా కనిపిస్తున్న మమితా.. దానికి మ్యాచింగ్‌గా డిజైన్ చేసిన బ్లాక్ బ్లౌజ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బ్లౌజ్‌పై ఉన్న అందమైన ఎంబ్రాయిడరీ వర్క్, నెట్ స్లీవ్స్ ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ఇక సంప్రదాయ ఆభరణాలను ఆధునిక శైలిలో ధరించి తన ఫ్యాషన్ సెన్స్‌ను చాటుకుంది. వదులుగా వదిలిన కురులు, ఆకట్టుకునే మేకప్, అందమైన చిరునవ్వుతో కెమెరా ముందు ఎంతో ఆత్మవిశ్వాసంతో పోజులిచ్చింది. సంప్రదాయ దుస్తుల్లోనూ ట్రెండీగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. మమితా బైజు బ్లాక్ శారీ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



Editor, Publiser & Owned by PERIKA ABHILASH, Address: 2-1-243/25/A, AMBEDKAR NAGAR, NALGONDA, TELANGANA-508001.
Printing: KOLANU PRINTERS H. NO: 6-2-1058, PLOT NO. 10, OLD VT COLONY, HYD ROAD, NALGONDA, TELANGANA-508001.